## క్లుప్తంగా

### నేటి నుంచి కోనేటిరాయుని పవిత్రోత్సవాలు



కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయం

గంగవరం: మండలంలో ప్రసిద్ధ టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు ఆదివారం తెలిపారు. తొలి రోజు సోమవారం ఉదయం స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం, సాయంత్రం 6గంటలకు అంకురార్పణం, రెండవ రోజు మంగళవారం ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం కుంభారాధన, హోమం, బుధవారం ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం పవిత్ర సమర్పణ, సాయంత్రం గ్రామోత్సవం, చివరిరోజు గురువారం ఉదయం ప్రధాన హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి, కుంభవాహన సేవతో స్వామివారి పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు.వార్షిక పవిత్రోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

### కంటి ఆపరేషన్లకు 24మంది ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివ, వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలకు చెందిన వైద్యబృందం శిబిరంలో 163 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అందులో 24 మందిని ఆపరేషన్లకు వైద్యులు ఎంపిక చేశారు. వీరికి కుప్పంలో ఉచిత ఆపరేషన్లు చేసి కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు డాక్టర్ శివ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, ప్రతినిధులు ముత్యాలు, సుధాకర్, మహిపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సురేష్, రజి అహమ్మద్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

బైరెడ్డిపల్లి: ఐసీసీ వన్డే క్రికెట్ వరల్డ్ కప్–2023 ప్రారంభం కావడంతో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ మోహన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమాయక ప్రజలను, యువకులను లక్ష్యంగా చేసుకుని బెట్టింగ్ పేరిట మోసగించడానికి యత్నిస్తే ఉపేక్షించేది లేదని, బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా నేరమన్నారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు తెలిస్తే ప్రజలు తమ దృష్టికి తేవాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కొని యువత జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు.

### గురురాజారావుకు సన్మానం



గురురాజారావును సన్మానిస్తున్న ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నేతలు

పలమనేరు: పట్టణానికి చెందిన ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నేత గురురాజారావును ఆ సంఘ సభ్యులు ఆదివారం సంఘ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సంఘ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నివడం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన్ను సన్మానించారు. పలువురు ఏపీ పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

### కల్యాణం..కమనీయం

పలమనేరు: మండలంలోని గొల్లపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ నేతలు, ప్రజాప్రతినిధులతో కలసి హాజయ్యారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం తెలిపారు. పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### నేడు మండల పూజ



అరుణాచలేశ్వరస్వామి

సదుం: మండలంలోని జాండ్రపేట అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మండల పూజ చేయనున్నారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 40 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలతోపాటు అభిషేకాలు చేయనున్నట్టు ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి భక్తులకు ఆలయంలో అన్నదానం చేస్తామన్నారు.

# కలసికట్టుగా పని చేయండి

- ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ గెలుపే లక్ష్యం
- కష్టపడే వారికి తగిన గుర్తింపు
- మంత్రి పెద్దిరెడ్డి కార్యకర్తలకు పిలుపు



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



హాజరైన కార్యకర్తలు

రొంపిచెర్ల: వైఎస్సార్ సీపీలో విభేదాలకు తావివ్వకుండా అందరూ కలసికట్టుగా పని చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రొంపిచెర్ల క్రాస్ రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకుపోవాలని, మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి సీఎం జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజక వర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేశామని, ఇంకనూ మిగిలిన కొన్ని పనులను ఎన్నికల లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు కలసి ఏకతాటిపై నడిచి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి , జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీం ఖాన్, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కరీముల్లా, శ్రీనాథనాయుడు, సురేంద్ర నాయుడు, నాగరాజ, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, యర్రంరెడ్డి, సదాశివారెడ్డి, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ మురుగేష్

కుప్పం రూరల్: పార్టీలో వివిధ స్థాయిల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కుప్పం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ అన్నారు. ఆదివారం కుప్పంలోని పార్టీ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. మురుగేష్ మాట్లాడుతూ, త్వరలో ఎన్నికలు రానున్నాయని, ప్రతి ఒక్కరూ దీనికి సమాయత్తమై ఉండాలన్నారు. విభేదాలు లేకుండా పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం నడచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నపక్షంలో తనకు తెలియజేస్తే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్యనే ఉండాలని, ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కుప్పంకు ప్రాతినిధ్యం ఇక్కడ స్థిరనివాసం ఉండటంగానీ, ప్రజా సమస్యలను ఏనాడూ తెలుసుకున్న పాపానపోలేదని ఈ పర్యాయం ఆయనన్ను ఓడించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చల్లగా ఉన్నారని, పార్టీకతీతంగా కుప్పం నియోజవర్గంలోనూ టీడీపీ సానుభూతిపరులకు సైతం సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిందని, ఇది పార్టీ విజయానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ భాగ్యరాజ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

## మురుగు కాలువ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, సర్పంచ్ రాజ్‌గోపాల్

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ కొత్తారిగడ్డ గ్రామంలో ఆదివారం స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఈ గ్రామంలో పర్యటించినప్పుడు మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ జీజీఎంపీ నిధులు మంజూరు చేశారు. రూ.2 లక్షలతో కాలువలు నిర్మిస్తున్నట్లు సౌమ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.

## దంపతులపై కేసు

రామకుప్పం: మండలంలోని బల్ల గ్రామానికి చెందిన సలావుద్దీన్ సింగంపల్లె సమీపంలో పొలం ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆ పొలం తనదని సలావుద్దీన్‌తో ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం శ్రీనివాసులు అతని భార్య విజయమ్మ తమ మతాచారానికి విరుద్ధమైన పదార్థాన్ని తన శరీరంపై చల్లారని సలావుద్దీన్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు తెలిపారు.

## రాయలసీమ జన జీవన చిత్రమే 'సగిలేటి కథ'




మాట్లాడుతున్న సగిలేటి కథ చిత్రం హీరో రవి మహాదశం

తిరుపతి కల్చరల్: రాయలసీమ జన జీవన శైలితో పాటు సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ సరికొత్త పంథాలో ప్రేక్షకులను ఆకట్టుకునే చక్కటి ఎంటర్‌టైన్‌మెంట్ కథా చిత్రం సగిలేటి కథ అని దర్శకుడు రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన సగిలేటి కథ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం చిత్రం యూనిట్ సభ్యులతో ఒక హోటల్లో మీడియాతో మాట్లాడారు. తాను తిరుపతి వాసినని, తొలిసారి కొత్త హీరో రవి మహాదశం, హీరోయిన్ విహిక, రాయలసీమకు చెందిన నటులతో సినిమాను రూపొందించినట్టు తెలిపారు. ఇటీవల విడుదలైన చిత్ర ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. రాయలసీమ ప్రజల సంప్రదాయాలు, జీవన శైలిని వివరిస్తూ రూపొందించిన చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 13న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరో రవి మహాదశం మాట్లాడుతూ రాయలసీమ అంటే ఫ్యాక్షనిజం అనే తరహాలో చిత్రాలు వచ్చాయని, వాటికి భిన్నంగా రాయలసీమ ప్రజల జీవన శైలి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ రెండు గంటల సేపు చక్కటి ఆనందాన్ని పంచేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చిత్ర నిర్మాత దేవిప్రసాద్, సంగీత దర్శకుడు జశ్వంత్, నటులు నరసింహప్రసాద్, శాంబోలు హరినాథ్ పాల్గొన్నారు.



రామనపల్లెలో సిమెంటురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## అమ్మా!..పథకాలు అందుతున్నాయా?

- ఎమ్మెల్యే వెంకటేగౌడ



రామనపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె:

''అమ్మా! ఎలా ఉన్నావు?

బాగున్నా నాయనా..

పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా?

అన్నీ బాగానే అందుతున్నాయి..

పింఛన్లు సరైన టైమ్‌కే ఇస్తున్నారా?

నెల మొదలైన తొలిరోజే తెల్లారేసరికి ఠంచనుగా పింఛన్లు ఇంటికాడికే తెచ్చిస్తాండారు..

చానా సంతోషంగా ఉంది..మీరంతా చల్లంగా ఉండాలి నాయనా..

ఇదీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ, వృద్ధులకు నడుమ జరిగిన సంభాషణ. ఆదివారం మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలోని రామనపల్లెలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. 482 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

**సీసీ రోడ్డు ప్రారంభం**

పుంగనూరు– బైరెడ్డిపల్లె రహదారి నుంచి రామనపల్లెకు సుమారు రూ.42 లక్షలతో వేసిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరుతుండడంతో ఆ కుటుంబాలు నిశ్చింతగా ఉంటున్నాయన్నారు. మహిళలను లక్షాధికారులు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ రుణాలు, క్రమం తప్పకుండా వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలు ఇస్తున్నారన్నారు. దీంతో మహిళలు కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని, మంచి చేసిన ప్రభుత్వానికి మరోసారి దీవించాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబునాయుడు రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్నారని, స్వాతంత్ర్య సమరయోధుడెవరో జైలుకెళ్లినట్లు పచ్చమీడియా ఆయనను మోస్తోందని, చంద్రబాబు ఎంతగా ప్రజలను మోసగించారో ప్రజలకు తేటతెల్లమైందన్నారు. తమ సీఎం ఎంతగా మేలు చేస్తున్నా పట్టించుకోని పచ్చమీడియా, టీడీపీ నాయకులు పనికట్టుకుని సీఎం, తమ పార్టీ నేతలపై దుష్ప్రచారం చేస్తున్నా ప్రజలకు వాస్తవాలేమిటో తెలుసన్నారు. కార్యక్రమంలో రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శులు దయానందగౌడు, చలపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు క్రిష్టారెడ్డి, వెంకటేష్, రమణారెడ్డి, రాజప్ప, దేవేంద్రరెడ్డి, చంద్రమౌళి, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

## జగనన్న పాలన అవసరాన్ని చాటి చెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి

శాంతిపురం: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో భాగంగా మళ్లీ జగనన్న పాలన అవసరాన్ని పార్టీ శ్రేణులు ప్రజలందరికీ వివరించాలని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి చెప్పారు. ఆదివారం ఓ కళ్యాణ మండపంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. దండపాణి మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనకు ఉన్న తేడాను, తమ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు ఎంతగా ప్రజల దరికే చేరుతున్నాయో వివరించాలన్నారు. అలాగే ఇదే విషయమై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి నాలుగున్నరేళ్ల కాలంలో లక్షలాది రూపాయలు అందడంతో పూర్తి సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఇదే విషయాన్ని బలంగా చాటిచెపాలన్నారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, వైస్ ఎంపీపీ పట్టాభి, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ పరమాత్ముడే జగద్గురువు

కుప్పం రూరల్: శ్రీకృష్ణ పరమాత్ముడే జగద్గురువని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు.ప్రబోధానంద రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీతపై ఆదివారం కుప్పంలోని బైపాస్ రోడ్డులో ప్రచారం చేశారు. కృష్ణ మాట్లాడుతూ, భగవద్గీతను కులమతాలకు అతీతంగా పారాయణం చేయవచ్చని, దీంతో శాంతి, సౌభాగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను ప్రజలకు పంచారు. కార్యక్రమంలో ప్రకాశ్, నాగరాజు, కృష్ణారెడ్డి, దేవరాజు, చరణ్, ఇందిర, రాధా, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### పీలేరు-కాణిపాకం బస్సు ప్రారంభం

ఐరాల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పీలేరు డిపోకు చెందిన నూతన ఆర్టీసీ బస్సుకు పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు మండల ప్రజలు పీలేరు నుంచి పాటూరు వయా ఐరాల మీదుగా కాణిపాకం వరకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని అర్జీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో బస్సు సర్వీసును ఏర్పాటు చేశారన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు పీలేరు నుంచి ఆర్టీసీ సర్వీసు బయలుదేరి కాణిపాకానికి 7 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో 35 యర్లంపల్లె మాజీ సర్పంచ్ రాజేంద్ర, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సురేంద్రయాదవ్, వార్డు మెంబర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



క్లిక్..క్లిక్: సమావేశమైన పూర్వ విద్యార్థులు

పుంగనూరు: స్థానిక సుబేదారువీధిలోని ఎలిమెంటరీ పాఠశాలలో 1970–1975 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం స్థానిక కోనేటిపాళ్యెంలో నిర్వహించారు. విదేశాలలో స్థిరపడిన వారితో సహా సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు కలివారు. తమ బాల్య స్మృతులు నెమరేసుకుంటూ సందడి చేశారు. పూర్వ విద్యార్థుల్లో ప్రస్తుత డాక్టర్లు సత్యవతి, యతీశంతో పాటు మిత్రులు చంద్రశేఖర్, మురళీకృష్ణ, నిరంజన్‌బాబు, నాగేంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలంలోని పలు గ్రామాల రహదారులకు మహర్దశ ప్రాప్తిస్తోంది. గతంలో మట్టిరోడ్ల మూలాన ప్రయాణానికి, వ్యవసాయోత్పత్తుల రవాణాకు అవస్థలు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మట్టిరోడ్లను తారు రోడ్లుగా చేస్తుండడంతో రవాణా వ్యవస్థ మెరుగు పడుతోందని గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సదుం: శరవేగంగా జరుగుతున్న జోగివారిపల్లె-బత్తలవారిపల్లె అప్రోచ్ రోడ్డు పనులు

సదుం: మండలంలోని 79ఏ చింతమాకులపల్లె నుంచి మటుకుకు రూ.1.20 కోట్లు, బూరగమంద నుంచి దిన్నెవడ్డిపల్లెకు రూ.56 లక్షలు, ప్రధాన రహదారి నుంచి రంగనాథమిట్టకు రూ.45.5 లక్షలు, మొరవపల్లె నుంచి బురకాయలబండకు రూ. 48. 25 లక్షలు, రెడ్డివారిపల్లె నుంచి పెదకంటివారిపల్లెకు రూ.42.25 లక్షలతో రోడ్డు పనులు చేస్తున్నారు. అలాగే కొత్తమర్రిమాకులపల్లెకు అప్రోచ్ రోడ్డు రూ.57 లక్షలు, సీతన్నగారిపల్లెకు రూ. 19. 25 లక్షలు, పుట్టావారిపల్లె నుంచి చెనకవారిపల్లెకు రూ.4.20 కోట్లు, తాటిగుంటపాలెం నుంచి ఎర్రగుంట్లపల్లెకు రూ.35.50 లక్షలు, పుట్టావారిపల్లెకు రూ.33.50 లక్షలు, పాపిరెడ్డిగారిపల్లెకు రూ.33 లక్షలు, నాయనపాకాల రోడ్డు నుంచి కురవపల్లె నుంచి చిన్నప్పరెడ్డిగారిపల్లెకు రూ.1.06 కోట్లు, తిమ్మానాయనపల్లెకు రూ.30.25 లక్షలతో పనులు చేపట్టారు. చెరువుముందర గొల్లపల్లెకు రూ.22.75 లక్షలు, చీకలచేను నుంచి గంటావారిపల్లెకు రూ.1.58 కోట్లు, చిలకపాటివారిపల్లెకు రూ.43 లక్షలు, నీరుగట్టువారిపల్లెకు రూ.27.5 లక్షలు, కళిరెడ్డిగారిపల్లెకు రూ.19.5 లక్షలు, పొట్టెంవారిపల్లెకు రూ.1.05 కోట్లు, బొనుగుపల్లెకు రూ.1.28 కోట్లు, పచ్చిపాలవారిపల్లెకు రూ.74 లక్షలు మంజూరు అయ్యాయి. వీటిలో పలు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. మరికొన్ని శరవేగంగా జరుగుతున్నాయి.

### గతంలో ఇబ్బంది పడేవాళ్లం



ఇంతకుముందు మా ఊరి నుంచి పీలేరు మెయిన్‌రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు అంతా గుంతలే. చానా ఇబ్బందులు పడేవాళ్లం. ఏవైనా వెహికల్స్ రావాలనా, పోవాలన్నా అవస్థలు తప్పేవి కాదు. ఇప్పుడు తారు రోడ్డు వేస్తున్నారు. మా కష్టాలు తీరినట్లే. ప్రయాణానికి, రైతులు పండించే కూరగాయలు, ఇతరత్రా వాటి రవాణాకు ఏ బాధలూ ఉండవు.

–ఎల్లారెడ్డి, పాపిరెడ్డిగారిపల్లె

### అవస్థలు తీరాయి



మా ఊరి నుంచి ప్రధాన రహదారికి కిలోమీటరు పైనే మట్టి రోడ్డు ఉండేది. గుంతలమయంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రోడ్డు సమస్యను చెప్పాం . ఆయన స్పందించారు. తారు రోడ్డు మంజూరు చేశారు. పనులు పూర్తవడంతో ఇబ్బందులు తొలగాయి.

–ఆనందరెడ్డి, చిలకపాటివారిపల్లె